సాక్షి జనగామ

గురువారం । 22 । మే । 2025



మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. - 8లో▸



'ఎల్‌సీ' నిర్లక్ష్యంపై సీఎండీ అసహనం

ఎల్‌సీ యాప్ వినియోగంలో నిర్లక్ష్యంపై విద్యుత్ ఇంజనీర్లు, ఆపరేటర్లపై టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35⁰/26⁰

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

సరస్వతి పుష్కరఘాట్‌కు వస్తున్న భక్తులు





పుష్కరిణికి మొక్కుతున్న దంపతులు

పుష్కరిణీ.. ప్రణామం!

- ఏడో రోజు కాళేశ్వరానికి తరలివచ్చిన భక్తజనం
- సరస్వతి ఘాట్‌లో స్నానాలు, ముక్తీశ్వరుడి దర్శనం

ఆకాశం అక్షింతలేసినట్లుగా చిరు చినుకులు.. నిశ్శబ్దంగా నది పరుగులు.. కాళేశ్వరం వైపు భక్తుల అడుగులు. వెరసి త్రివేణి సంగమం భక్త జన సందోహమైంది. ఏడో రోజు బుధవారం సైతం భక్తుల ప్రవాహం కొనసాగింది. పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు అంతర్వాహిని సరస్వతి నదికి మొక్కులు చెల్లించుకున్నారు. కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు లక్షమందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేశారు.

- మరిన్ని వివరాలు, ఫొటోలు: 8లో▸

పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



న్యూస్‌రీల్

26 నుంచి లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ

జనగామ రూరల్: లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ ఈనెల 26 నుంచి ప్రారంభం అవుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యాన ఇచ్చే ఈ శిక్షణకు అర్హత కలిగిన 225 మంది అభ్యర్థులు జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. మొత్తం 50 పని దినాల శిక్షణలో భాగంగా ఈనెల 26 నుంచి ఉదయం 8 గంటలకు స్థానిక సీజేబీటీలో శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. ఒరిజినల్ డాక్యుమెంట్లతో హాజరు కావాలని సూచించారు.

హైరిస్క్ ప్రాంతాల్లోని పిల్లలకు టీకాలు



జనగామ: జిల్లా కేంద్రం అర్బన్ పీహెచ్‌సీ పరిధి హైరిస్క్ ప్రాంతాల్లోని పిల్లలను గుర్తించి టీకాలు వేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు అన్నారు. ఇమ్యునైజేషన్ రెండో రౌండ్‌లో భాగంగా బుధవారం వైద్య సిబ్బందితో కలిసి క్లాం రోడ్డులోని హైరిస్క్ ఏరియా నిర్మాణం వద్దకు చేరుకుని వసల కార్మికుల పిల్లలకు ఓపీవీ, పెంటా 3 డోస్ టీకాలు వేసినట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం పిల్లలకు టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుట్ర

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: అన్నదాతల కష్టాలు తెలిసిన కేసీఆర్.. వ్యవసాయాన్ని పండుగ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చేందుకు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కమిషన్ పేరుతో కుట్రలకు తెరలేపారని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహానేతను లక్ష్యంగా చేసుకొని విచారణ పేరుతో ప్రస్తుత సర్కారు ఇబ్బంది పెట్టాలని చూస్తే మరోమారు మర్ల బడడం ఖాయమని హెచ్చరించారు. సర్కారు చేతకాని తనం, పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. పదేళ్లలో కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో ముందుంచి రాష్ట్ర కీర్తిని విశ్వవ్యాప్తం చేశారని, ఆయన గుర్తులు చెరపడానికి కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజలు కేసీఆర్ వెన్నంటి ఉన్నారని, ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పికొడతారని స్పష్టం చేశారు.

సాంకేతిక పరిజ్ఞానం ఘనత రాజీవ్‌దే..



జనగామ: దేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని ఏఎంసీ చైర్మన బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం డీసీసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ భారతం కోసం కలలు కన్న రాజీవ్ గాంధీ ఆలోచనలు, సేవలు ఈ తరానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, నాయకులు గంగం నర్సింహారెడ్డి, గాదపాక రామచందర్, బక్క శ్రీనివాస్, బాల్‌రాజ్ గౌడ్, ప్రకాశ్ యాదవ్, పవన్ రాజ్, ప్రకాశ్, స్టాలిన్, పర్వతాలు, మచ్చ ప్రవీణ్, కదారు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

'సెల్లార్' బిజినెస్

ప్రాణాలతో చెలగాటం

- నిబంధనలకు నీళ్లు.. అడ్డగోలుగా అనుమతులు..?
- ఫైర్ ఇంజన్ వెళ్లలేని ఇరుకైన రోడ్లు..
- ఫైర్ సేఫ్టీ లేకుండానే అద్దెలకు..
- మామూళ్ల మత్తులో అధికారులు

జనగామ: వరుస అగ్ని ప్రమాదాలతో అమాయక ప్రజలు మృత్యువాత పడుతున్నారు.. వందల కోట్ల రూపాయల ఆస్తి బుగ్గి పాలవుతోంది.. అయినా అధికార యంత్రాంగం మేల్కోవడం లేదు. నిబంధనలను ఉల్లంఘించి సెల్లార్ల నిర్మాణంతో వ్యాపారాలు చేస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగితే మంటలు ఆర్పే పరిస్థితి కనిపించడం లేదు. ఇరుకైన రోడ్లు.. అందులోనే వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వహణ ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రులు, బాంక్వెట్ హాళ్లు, షాపింగ్ మాళ్లు, హోటళ్లు, లాడ్జీలు, బార్ అండ్ రెస్టారెంట్లు, బ్యాంకులు, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లు సూపర్ మార్కెట్లు, వాహన షోరూంలలో ఫైర్ సేఫ్టీ గాలిలో దీపంలా మారింది. పురపాలిక అనుమతులు జారీ చేసే సమయంలో కళ్లు మూసుకుని పర్మిషన్లు ఇస్తున్నారు.

అడ్డగోలుగా సెల్లార్ల నిర్మాణం

పట్టణంలో సుమారు 1,950 వరకు వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండగా.. 11వేల పైచిలుకు గృహాలు(మొదటి, రెండవ, మూడవ, పెంట్‌హౌస్) ఉన్నాయి. ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు అపార్టుమెంట్ల నిర్మాణ సమయంలో పురపాలిక, అగ్నిమాపక తదితర శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీతో పాటు ప్రమాదం జరిగితే ఎగ్జిట్ ఉండేలా చూసుకోవాలి. అయితే.. పట్టణంలో సెల్లార్లకు అనుమతులు లేకున్నా.. పార్కింగ్ కోసమంటూ 'కొంతమంది'ని మేనేజ్ చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. కొద్ది రోజుల పాటు సెల్లార్ ఖాళీగా ఉంచి.. ఆ తర్వాత వ్యాపార సంస్థలకు అద్దెకు ఇస్తున్నారు. ఇందులో ఎలక్ట్రికల్ దుకాణాల గోదాంలు, ప్రైవేట్ ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న లేబొరేటరీలు, బిగ్ జబార్, ఫ్యాన్సీ స్టోర్, ఏజెన్సీలు తదితర షోరూంల నిర్వహణ సాగిస్తున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ వ్యాపార సంస్థల్లో పదుల సంఖ్యలో కస్టమర్లు, అందులో పని చేసే కార్మికులు ఉంటారు. ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని చెలరేగితే తప్పించుకునే పరిస్థితి ఉండదు.



సెల్లార్‌లో ఎంపోరియం



స్వర్ణ కళామందిర్ రోడ్డున సెల్లార్‌లో బిగ్ బజార్





కృష్ణకళామందిర్ రోడ్డున ఉన్న సెల్లార్‌లో వ్యాపారం, ఇరుకైన స్వర్ణ కళామందిర్ రోడ్డు

వరుస ఘటన.. అయినా మేల్కోని అధికారులు

జనగామ పట్టణంలో గతంలో షాపింగ్‌మాల్, ఎలక్ట్రిల్ షాపులో మంటలు చెలరేగి లక్షలాది రూపాయల ఆస్తి నష్టంతోపాటు తృటిలో ప్రాణాపాయం తప్పిన విషయం తెలిసిందే. ఇటీవల ఓ బైక్ షోరూంలో రాత్రి సమయంలో మంటలు వ్యాపించగా.. అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగలేదు. సెల్లార్లను వ్యాపార సంస్థలకు అద్దెకు ఇస్తున్నారు. వాటిలో ఎలక్ట్రికల్, పేయింట్స్, ప్లాస్టిక్, డోర్‌లు, కరెంటు సామగ్రి, బిగ్ బజార్, కెమికల్, ఆయిల్ తదితర దుకాణాదారులు స్టాక్‌ను భద్ర పరుస్తున్నారు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదం జరిగితే కనీసం నివారించే పరిస్థితి లేకుండా పోయింది. భారీగా మంటలు చెలరేగిన సమయంలో పక్కనే ఉన్న భవనాలు, నివాస ప్రాంతాలకు వ్యాపిస్తాయి. ఇటీవల పట్టణంలో బాంక్వెట్ హాళ్ల కల్చర్ పెరిగింది. వీటిలో చిన్న చిన్న ఫంక్షన్లు చేయడానికి అన్ని వర్గాల ప్రజలు ముందుకువస్తున్నారు. బాంక్వెట్ హాల్‌లోకి ప్రవేశించిన వారు తిరిగి అదే దారిన లేదా లిఫ్ట్ నుంచి కిందకు రావాల్సి ఉంటుంది. ఒక్కో ఫంక్షన్‌లో కనీసం 150 మంది నుంచి 250 మంది వరకు ఉంటారు. అనుకోకుండా సంభవించే ప్రమాదాలతో అందులో నుంచి బయటకు రావడం చాలా కష్టం. అక్కడ ఫైర్ సేఫ్టీ కూడా ఉండదు.

2024 ఏప్రిల్ నుంచి 2025 మే వరకు జిల్లాలో జరిగిన అగ్ని ప్రమాద వివరాలు

నియోజకవర్గం	ప్రమాదాలు	నష్టం	సేవ్(నగదు)
జనగామ	52	రూ.24.33కోట్లు	రూ.42.90కోట్లు
పాలకుర్తి	33	రూ.28.05లక్షలు	రూ. 2.07కోట్లు
స్టేషన్‌ఘన్‌పూర్	16	రూ.8.10లక్షలు	రూ.34లక్షలు



ప్రతీ చోట ఫైర్ సేఫ్టీ ఉండాలి



ఫంక్షన్ హాళ్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, బాంక్వెట్ హాళ్లు, హోటళ్లు, లాడ్జీలు, ఇండస్ట్రియల్, కాటన్ మిల్లులు ఇలా ప్రతీచోట ఫైర్ సేఫ్టీ ఉండాలి. పట్టణంలో చాలా చోట్ల ఫైర్ సేఫ్టీ లేదు. అన్ని వర్గాల వ్యాపార, వాణిజ్య సంస్థలకు గతంలోనే నోటీసులు జారీ చేశాం. అగ్ని ప్రమాదం సంభవిస్తే ఫైర్ ఇంజన్ వచ్చే వరకు మంటలను అదుపు చేసేందుకు పోర్టబుల్ అగ్నిమాపక యంత్రాలు తప్పక అమర్చుకోవాలి. ఇందుకు సంబంధించి 8 అంశాలతో కూడిన రిపోర్టును ఉన్నతాధికారులకు అందించాం.

- రేమండ్‌బాబు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించి సర్కారు ఆస్పత్రులపై మరింత నమ్మకం పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ రావుతో కలిసి పలు విభాగాలను పరిశీలించారు. జనరల్, ఎమర్జెన్సీ వార్డుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి ఆస్పత్రిలో వసతులు, అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, అపరిశుభ్రతకు తావులేకుండా శానిటేషన్ పనులను పర్యవేక్షించాలని చెప్పారు. నూతన సీటీ స్కాన్ సేవలను త్వరగా అందుబాటులోకి తేవాలని, లాప్రోస్కోపీ, డెంటల్ విభాగంలో రూట్ కెనాల్ సేవలను మరింత ఇంప్రూవ్ చేయాలని సూచించారు. పలు వార్డుల్లో ఉన్న ఏసీలు పనికి రాకుండా పోగా.. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యూడీఐడీ కేటాయింపునకు దివ్యాంగులను వెంట వెంటనే పరీక్షించి పంపించాలన్నారు. రోగుల సౌకర్యార్థం ఎంసీహెచ్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ చాంబర్‌లో హెచ్ఓడీలు, వైద్యులతో సమీక్షించారు. ఆస్పత్రిలో కొరత ఉన్న వైద్య పరికరాలను కొనుగోలు చేయాలని, రోగులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. అక్కడి నుంచి మెడికల్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ వసంత ఉన్నారు.



కేర్ టేకర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ డిపో సేవలు భేష్

- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్

జనగామ: ఆర్టీసీ జనగామ డిపో సేవలు బాగున్నాయి.. ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నదని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సోలమన్ అన్నారు. బుధవారం రీజినల్ మేనేజర్ విజయ భాను, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకిరణ్‌తో కలిసి ఆయన స్థానిక డిపోను సందర్శించారు. డీఎం ఎస్.స్వాతి వారికి స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటి నీరు పోసిన తర్వాత ఉద్యోగులు, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలో ఉన్న అన్ని విభాగాల సిబ్బంది ఉత్తమ సేవలు అందిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించి ప్రయాణికుల మన్ననలు పొందడంతోపాటు సంస్థకు మరింత మంచి పేరు తేవాలని సూచించారు. క్రమశిక్షణతో పని చేయడం వల్లే ఉత్తమ ఫలితాలు వచ్చాయని వివరించారు. ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉద్యోగులకు బహుమతులు అందజేశారు.



జనగామ డిపోలో మొక్కలు నాటిన అనంతరం స్థానిక అధికారులు, సిబ్బందితో ఈడీ సోలమన్

నేటినుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 3,948 మంది విద్యార్థులు
- కేటాయించిన పరీక్ష కేంద్రాలు 10

జనగామ రూరల్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈఓ కె.జితేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3,948 మంది పరీక్ష రాయనుండగా.. 10 సెంటర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. పర్యవేక్షణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పదిమంది చొప్పున, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులు నిర్ణీత పరీక్ష సమయానికి 30 నిమిషాల ముందు సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.

సంత వేలం ఆదాయం రూ.13.46 లక్షలు

లింగాలఘణపురం: నవాబుపేట కోదండ రామ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే పశువుల సంతకు వేలం ద్వారా రూ.13.36 లక్షల ఆదాయం సమకూరింది. ఇందులో పశువుల డక్కా వేలం పాట బూడిద సదానందం రూ.10,10,000, పగ్గాల విక్రయం హక్కును మాలోతు మధుసూదన్ రూ.3,36,000లకు దక్కించుకున్నారు. వేలం పాటలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, జనగామ పట్టణ ఉప్పలమ్మ దేవాలయ ఈఓ కెకె.రాములు, నవాబుపేట దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ రాజేందర్‌రెడ్డి, కె.మోహన్, రవితేజ, ఎల్లాగౌడ్, వసంత పాల్గొన్నారు.

రెండు రోజులు.. భారీ వర్షాలు

- హెచ్చరించిన వాతావరణ శాఖ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: అల్పపీడనం కారణంగా రాగల రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదవుతాయని, 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైందని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం తెల్లవారు జాము 5 గంటల వరకు 6.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాత్రి 7 గంటల వరకు 10 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. భారీవర్షాల నేపథ్యంలో జిల్లాలోని కుంటలు, చెరువుకట్టలపై అధికార యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రజలు చెరువులు, కాలువల వద్ద జాగ్రత్తగా ఉండాలని, వర్షం కురుస్తున్న సమయంలో ఎవరూ చెట్ల కిందకు వెళ్ల కూడదని కలెక్టర్ సూచించారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళవారం నుంచి బుధవారం రాత్రి వరకు జిల్లాలో కురిసిన వర్షపాతం (మిల్లీమీటర్లలో)ఇలా..

మండలం	లోకేషన్	వర్షపాతం
బచ్చన్నపేట	వడమటికేశ్వాపూర్	32.8
పాలకుర్తి	గూడూరు	34.0
బచ్చన్నపేట	బచ్చన్నపేట	22.5
స్టేషన్‌ఘన్‌పూర్	స్టేషన్‌ఘన్‌పూర్	16.8
పాలకుర్తి	వావిలాల	16.0
పాలకుర్తి	పాలకుర్తి	20.0
దేవరుప్పుల	దేవరుప్పుల	7.8
జఫర్‌గఢ్	జఫర్‌గఢ్	7.3
కొడకండ్ల	కొడకండ్ల	6.5

యుద్ధ ప్రాతిపదికన రిజర్వాయర్ల పనులు

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ధ్యేయని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం చెన్నూరు రిజర్వాయర్ పనులను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్లను పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని, పనులు పూర్తి చేస్తే సుమారు 77వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. భూసేకరణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెన్నూరు రిజర్వాయర్ తూము సమస్య పరిష్కరించి రైతులను ఆదుకుంటామని అన్నారు. మాజీ ఎంపీపీ కారుపోల శ్రీనివాస్‌గౌడ్, మదాసు హరీశ్, గుగులోతు యాకూబ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు



చెన్నూరు రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పేదల సంక్షేమమే ధ్యేయం

కొడకండ్ల: ప్రజలకు మౌలిక వసతుల కల్పన, పల్లెల అభివృద్ధి, నిరుపేదల సంక్షేమమే తన ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో రూ.కోటికి పైగా విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌నాయక్, రాజేష్‌నాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ ఈరంటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు న్యాయం

పాలకుర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు సరైన న్యాయం జరిగిందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం చెన్నూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ధాన్యం విక్రయానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. మద్దతు ధర గురించి ఆరా తీసి సమస్యలు తెలుసుకున్నారు. తూకంలో పారదర్శకత ఉండాలని, తడిసిన ధాన్యాన్ని తిరస్కరించే పద్ధతి కాదని నిర్వాహకులకు సూచించారు. కారుపోతుల శ్రీనివాస్, మాదాసు హరిష్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం

- ఎన్పీడీసీఎల్ డీఈ రాంబాబు

స్టేషన్‌ఘన్‌పూర్: వినియోగదారులకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని ఎన్పీడీసీఎల్ స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ వై.రాంబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలకు విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గృహ, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలకు కలిపి ఎస్ఎస్ 34/160 కేవీఏ సామర్థ్యం కలిగిన ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండేదని, దాంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారని తెలిపారు. ఇకపై ఆ సమస్య ఉండదని చెప్పారు. ఏడీఈ రణధీర్‌రెడ్డి, ఏఈలు శంకర్, రణధీర్, ఫోర్‌మన్ రాజేందర్, ఎల్ఐ రామాచారి, లైన్‌మన్‌లు శ్రీధర్‌పటేల్, మహమ్మద్ అన్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

నదీతీరం.. జనహోరం


ప్రమిదలు వదులుతున్న మహిళలు





తమ చిన్నారులకు పుష్కర స్నానం చేయిస్తున్న కుటుంబ సభ్యులు


శునకాలకు పుష్కరస్నానం చేయిస్తున్న యువతులు


దేవుళ్ల చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మహిళలు


నదిలో భక్తురాలి పూనకం




నదిలో సెల్ఫీ దిగుతున్న మహిళలు, చిన్నారులు


పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తజనం


పార్కింగ్ స్థలాల్లో నిలిపిన వాహనాలు (విహంగ వీక్షణం)


బురదలో దిగబడిన వ్యాన్‌ను తాడుతో బయటకు లాగుతున్న జేసీబీ


మొక్కుతున్న గిరిజన మహిళ


పుష్కర ఘాట్‌లో ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ వద్ద భక్తులు


ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో పుష్కరాలకు తరలివస్తున్న భక్తులు


నవరత్నమాలిక హారతి ఇస్తున్న పండితులు

భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని దంపతుల ఆత్మహత్యాయత్నం

తరిగొప్పుల: తాము కొనుగోలు చేసిన భూమిని అమ్మకందారుడు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తూ తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారని దంపతులు శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రం శివారు ఎన్యానాయక్‌తండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లికి చెందిన జంగ రవి తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండాకు చెందిన ముడావత్ సంపత్‌నాయక్ వద్ద 2 సంవత్సరాల క్రితం 2 గుంటల భూమిని గుంటకు రూ.3.30 లక్షల చొప్పున కొనుగోలు చేశాడు. అయితే ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా సంపత్‌నాయక్ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. దీంతో రవి పెద్దమనుషులను ఆశ్రయించగా 2 గుంటలకు బదులు మరోచోట 8 గుంటల భూమి ఇవ్వాలని రెండు రోజుల క్రితం తీర్మానం చేశారు. సంపత్‌నాయక్ మరోచోట 8 గుంటల భూమికి హద్దులు చూపించగా ఆ భూమిని రవి మంగళవారం ట్రాక్టర్‌తో దున్నాడు. ఈ క్రమంలో ఏమైందో తెలియదు కానీ బుధవారం ఉదయం రవి తన భార్య, బిడ్డతో సంపత్‌నాయక్ ఇంటికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆ దంపతులను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'ఎల్‌సీ' నిర్లక్ష్యంపై సీఎండీ అసహనం


వీసీలో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

- డ్యాష్ బోర్డులో వివరాల నమోదులో అలసత్వంపై సీరియస్

హన్మకొండ : ఎల్‌సీ యాప్ వినియోగంలో నిర్లక్ష్యంపై విద్యుత్ ఇంజనీర్లు, ఆపరేటర్లపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. ఎల్‌సీ యాప్ నిర్వహణ, డ్యాష్‌బోర్డులో పారామీటర్ల నమోదు, విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. విద్యుత్ ప్రమాదాలు తగ్గించేందుకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించేందుకు ప్రవేశ పెట్టిన ఎల్‌సీ యాప్‌పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదే విధంగా డ్యాష్ బోర్డులో ఎవరు ఏ పని చేస్తున్నారో నమోదు చేయకపోవడంపై సీరియస్ అయ్యారు. ఇక నుంచి అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు రాజు చౌహాన్, అశోక్, జీఎం శ్రీనివాస్, ఎస్ఈలు, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్


మాట్లాడుతున్న జస్టిస్ చంద్ర కుమార్

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం తాత్సారం వీడి వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో శాంతి చర్చల కమిటీ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జైసింగ్ రాథోడ్ అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జస్టిస్ చంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మధ్య భారతదేశంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న అంతర్ యుద్ధంలో సామాన్య ప్రజలు, అమాయక ఆదివాసీలు చనిపోతున్నారన్నారు. రాజ్యం తరఫున పోలీసులు సైతం మరణించి మధ్య భారతమంతా నెత్తురోడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మారణహోమాన్ని గమనించిన శాంతి చర్చల కమిటీ చేసిన అభ్యర్థన మేరకు మావోయిస్టు పార్టీ కాల్పులు విరమణ చేసి శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిందన్నారు. కేంద్రం స్పందించకుండా దాడులను మరింత పెంచి సామాన్యులను సైతం చంపేస్తోందని, కాల్పుల విరమణ స్థితిలో ఉన్నవాళ్లను చుట్టుముట్టి చంపడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శాంతి చర్చల కమిటీ రాష్ట్ర సభ్యుడు సోమ రామ్మూర్తి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, చుంచు రాజేందర్, అనిక్ సిద్ధికి, చిల్ల రాజేంద్రప్రసాద్, బొట్ల భిక్షపతి, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు అబ్దుల్ నబీ, పండుగ శ్రీనివాస్, ఆదినారాయణ, దొమ్మటి ప్రవీణ్ కుమార్, కొండ్ర నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో నోడల్ సెంటర్ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల కోఆర్డినేటర్లుగా జితేందర్, సరిత


జితేందర్


సరిత

కేయూ క్యాంపస్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అనుబంధ సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఇస్రో -ఐఆర్ఎస్) డెహ్రాడూన్ వరంగల్ ప్రాంతీయ కోఆర్డినేటర్లుగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జితేందర్, డాక్టర్ అలేటి సరిత నియమితులయ్యారు. ఈ మేరకు ఇస్రో నుంచి సమాచారం అందిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి బుధవారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఇస్రో ఈ కోర్సెస్‌కు సంబంధించి నోడల్ సెంటర్‌గా ఉందన్నారు. విద్యార్థులు ఈ కోర్సెస్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కాగా, డాక్టర్ జితేందర్, డాక్టర్ సరితను ప్రిన్సిపాల్ జ్యోతి అభినందించారు.

పుష్కర స్నానం.. పులకించిన భక్తజనం

- సరస్వతీనది పుష్కర స్నానాలకు భక్తుల రద్దీ
- వివిధ రాష్ట్రాల నుంచి భారీగా రాక
- ఎమ్మెల్యేలు వినోద్, అనిరుధ్‌రెడ్డి, సీపీ అంబర్‌కిశోర్‌ఝా, ఎస్పీ శ్రీనివాసరావు పుణ్యస్నానాలు
- ఏడో రోజు లక్షకుపైగా తరలొచ్చిన జనం
- వర్షంతో చల్లబడిన వాతావరణం


కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు

భూపాలపల్లి/కాళేశ్వరం: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీనది పుష్కరాలకు భక్తులు రోజురోజుకూ భారీగా తరలివస్తున్నారు. బుధవారం ఏడోరోజు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కాళేశ్వరానికి తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర పుణ్యస్నానాలు ఆచరించి, నదీమాతకు పూజలు చేశారు. పిండప్రదాన పూజలు చేశారు. నదీమాతకు చీర, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. నదిలో దీపాలు వదిలి మొక్కులు చెల్లించారు. ఇసుకలో సైకత లింగాలు చేసి పూజించారు. కాళేశ్వరాలయంలో కాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

ఏడోరోజు లక్షకుపైగా...

హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి రహదారి మీదుగా, పెద్దపల్లి, మంథని, కాటారం మీదుగా వాహనాలు తరలివచ్చాయి. సిరొంచ అంతర్రాష్ట్ర వంతెన గుండా మంచిర్యాల, గోదావరిఖని, చెన్నూర్, ఆసిఫాబాద్, నిర్మల్ నుంచి భక్తులు తరలివచ్చారు. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు డివైడర్లు ఏర్పాటు చేసి నియంత్రించారు. ఆరో రోజు తగ్గిన భక్తులు.. ఏడో రోజు రెట్టింపు సంఖ్యలో తరలివచ్చారు. ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో త్రివేణి సంగమం సరస్వతీనదికి వచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి క్యూలైన్‌లో బారులుదీరారు.

ప్రముఖుల పూజలు..

సరస్వతీనది పుష్కరాల్లో ప్రముఖులు స్నానం ఆచరించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, రామగుండం సీపీ అంబర్‌కిశోర్‌ఝా, ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు పుష్కర స్నానం చేసి కాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అలాగే, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు కుటుంబ సమేతంగా సరస్వతి ఘాట్ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

వర్షంతో ఇబ్బందులు..

రెండు రోజులుగా ఉక్కపోత, ఎండ తీవ్రతతో తల్లడిల్లిన భక్తులకు బుధవారం సాయంత్రం గంట పాటు కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు. మరో వైపు పుష్కరఘాట్‌లో పార్కింగ్ స్థలాలు బురదమయంగా మారాయి. గాలి దుమారానికి బస్టాండ్ సమీపంలో హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఉజ్వల్‌పై రేకు లేచి పడడంతో తీవ్రగాయమైంది. రక్తస్రావం కాగా వెంటనే అంబులెన్స్ ద్వారా మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

- ఇల్లు శుభ్రం చేస్తుండగా ఘటన
- 13 రోజుల్లో మనుమరాలి పెళ్లి.. అంతలోనే విషాదం


నర్సమ్మ (ఫైల్)

హసన్‌పర్తి: మనుమరాలి పెళ్లికి ఇల్లు శుభ్రం చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన హసన్‌పర్తి మండలం జయగిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జయగిరికి చెందిన లింగాల నర్సమ్మ(60)కు ఇద్దరు కుమారులు మధు, చంద్రశేఖర్ సంతానం. మధు ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ.. ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందాడు. మధుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. మధు మృతి తర్వాత అతడి కుటుంబం బతుకుదెరువు నిమిత్తం రాంపూర్ వెళ్లింది. వచ్చే నెల 4న మధు చిన్న కూతురు పెళ్లి జరుగనుంది. జయగిరిలోనే పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ఇంటిని ముస్తాబు చేయడానికి ప్రవీణ్ జయగిరి వచ్చాడు. బుధవారం నానమ్మ నర్సమ్మతో కలిసి ప్రవీణ్ ఇల్లు శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో దండెంపై దుస్తులు ఆరేస్తున్న క్రమంలో నర్సమ్మ విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన ప్రవీణ్ ఆమెను రక్షించడానికి యత్నించి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనలో నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన


చేరాలు (ఫైల్)


ప్రవీణ్‌కుమార్ మృతదేహం

కొత్తగూడ/గూడూరు: పిడుగుపాటుకు మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ఇందులో ఓ గొర్రెల కాపరి, ఓ యువకుడు ఉన్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలం ఓటాయికి చెందిన ఏశబోయిన చేరాలు(50) గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. రోజువారీగా గొర్రెలను మేపేందుకు బుధవారం కూడా గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగా గొర్రెలను తోలుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో పిడుగుపడింది. దీంతో చేరాలు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మైదం సారయ్య కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరా అవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లిన ప్రవీణ్.. వర్షం వస్తుండడంతో రోడ్డు పక్కన చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగుపడడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

పీజీ సెమిస్టర్ల ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పరీక్షల విభాగం అధికారులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్)లో ఈఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పీజీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి విడుదల చేశారు. పీజీ కోర్సుల్లో మొదటి సెమిస్టర్ల పరీక్షల్లో మొత్తం 85 శాతం, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 93శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారని చంద్రమౌళి తెలిపారు. విద్యార్థినులు తమ ఫలితాలను సంబంధిత కాలేజీ వెబ్‌సైట్‌లోగాని లేదా కళాశాలలోని పరీక్షల విభాగంలో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి సుహాసిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు కె. శ్రీనివాస్, పి. రాజిరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేశ్ బాబు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు వన్ వే

నేటి నుంచి పుష్కరాలు ముగిసే వరకు అమల్లోకి..

భూపాలపల్లి: సరస్వతీనది పుష్కరాలకు వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో నేటి (గురువారం) నుంచి కాళేశ్వరం రూట్‌ను వన్‌వేగా మారుస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి పుష్కరాలు ముగిసే వరకు వన్ వే అమల్లో ఉంటుందన్నారు. హైదరాబాద్, వరంగల్, ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని తెలిపారు. అలాగే, కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు మంథని, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని సూచించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ నుంచి వచ్చే వాహనాలు సిరొంచ, అంతర్రాష్ట్ర బ్రిడ్జి మీదుగా కాళేశ్వరం చేరుకుని, తిరుగు ప్రయాణంలో కూడా అదే రూట్లో వెళ్లాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.